

## ఎక్స్‌ప్రెస్‌వేపై ల్యాండింగ్.. టేకాఫ్

### గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన డ్రిల్

షాజహాన్‌పూర్: పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన వేళ భారత వాయుసేన కీలక పరీక్షలు నిర్వహిస్తున్నది. ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధవిమానాల ల్యాండింగ్, టేకాఫ్‌ను పరీక్షిస్తున్నది. యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఉన్న గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై దాదాపు 3.5 కిలోమీటర్ల ఎయిర్‌స్ట్రిప్‌పై ఈ డ్రిల్‌ను శుక్రవారం విజయవంతంగా చేపట్టింది. రాఫెల్, ఎస్‌యూ-30 ఎంకేఐ, మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్, సీ-130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్-32 వంటి యుద్ధ విమానాలు ఈ డ్రిల్‌లో పాల్గొంటున్నాయి. పగలు-రాత్రి యుద్ధవిమానాలు టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేలా ఈ ఎక్స్‌ప్రెస్‌వే స్ట్రెచ్‌ను నిర్మించారు. గతంలో లక్నో-ఆగ్రా, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ డ్రిల్స్ నిర్వహించారు. అయితే అవి పగటి పూట ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం. ఇంకా కొంత నిర్మాణం జరగాల్సిన గంగా ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయితే ఇది దేశంలోనే నాలుగో అత్యవసర ఎయిర్‌స్ట్రిప్‌గా సేవలందించేందుకు సిద్ధమవుతుంది.

### పాక్ గగనతలంపై ఎగరని

## యూరప్ విమానాలు

- స్వచ్ఛందంగా దూరం పెట్టిన ప్రముఖ ఎయిర్‌లైన్స్
- భారత్-యూరప్ మధ్య పెరిగిన గంట ప్రయాణం
- పాకిస్థాన్ ప్రభుత్వానికి వేల కోట్లలో నష్టం
- ప్రయాణికులపై ఇక అదనపు భారం



న్యూఢిల్లీ: పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసిన కారణంగా పశ్చిమ దేశాలకు ప్రయాణించేందుకు దూరం పెరిగి ఖర్చులు ఎక్కువై నష్టపోతున్నది కేవలం ఇండియన్ ఎయిర్‌లైన్స్ మాత్రమే కాదు..అనేక దేశాలకు చెందిన ఎయిర్‌లైన్స్‌లు కూడా. తమపై నిషేధం లేనప్పటికీ అవి పాక్ గగనతలాన్ని స్వచ్ఛందంగా దూరం పెట్టడం గమనార్హం. చివరకు భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటున్నామనుకుని భ్రమపడి పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని చవిచూస్తోంది. తన గగనతలాన్ని ఉపయోగించుకున్నందుకు ఎయిర్‌లైన్స్‌ల నుంచి ఓవర్‌ఫ్లైట్ ఫీజుల పేరిట ప్రతి నెలా లక్షల డాలర్లు వసూలు చేస్తున్న పాకిస్థాన్ ఏరోస్పేస్ సంస్థ ఇప్పుడా ఆదాయాన్ని పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. గత రెండు రోజులుగా లుఫ్తాన్సా, బ్రిటిష్ ఎయిర్‌వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఇటలీకి చెందిన ఐటీఏ, పోలాండ్ లాట్ వంటి ప్రముఖ యూరోపియన్ ఎయిర్‌లైన్స్ సంస్థలు స్వచ్ఛందంగా పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకోవడం మానేశాయి. భారత్, పాక్ మధ్య తాజాగా తలెత్తిన ఉద్రిక్తతలే ఇందుకు కారణమని తెలుస్తోంది. యూరోపియన్ విమాన సంస్థలు పాక్ గగనతలాన్ని దూరం పెట్టడం వల్ల యూరప్, భారత్ మధ్య విమాన ప్రయాణం సగటున దాదాపు గంట ఎక్కువ పడుతుంది. పర్యవసానంగా పెరిగిన ఇంధన ఖర్చుల భారం ప్రయాణికులపైనే వేయకతప్పదు. అయితే ఆ భారం ఎప్పటి నుంచి మొదలవుతుందో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. పాకిస్థాన్ పౌర విమాన సంస్థ ఏటా ఓవర్‌ఫ్లైట్ చార్జీల కారణంగా ఏటా వందల కోట్ల రూపాయలు నష్టపోనున్నది.

## సరిహద్దుల్లో బంకర్లు సిద్ధం

- ఆగని పాక్ కవ్వింపు కాల్పులు
- 8వ రోజూ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన



జమ్ము, మే 2: సరిహద్దు అవతలి నుంచి కాల్పుల తీవ్రత పెరిగిన పక్షంలో ముందు జాగ్రత్త చర్యగా తమ సామూహిక, వ్యక్తిగత బంకర్లను సరిహద్దు గ్రామాల ప్రజలు శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. కేంద్ర ప్రభుత్వం 2017లో 14,460 సామూహిక, వ్యక్తిగత బంకర్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేసింది. సంబా, కథువా, జమ్ము, పూంచ్, రాజౌరీ జిల్లాలో 8,600కి పైగా సామూహిక, వ్యక్తిగత బంకర్ల నిర్మాణం జరిగినట్టు అధికారులు తెలిపారు. ఐబీ వెంబడి ఉన్న ఆర్‌ఎస్ పురా, అర్నియా సెక్టార్లలో పంటల కోతలు పూర్తి కాగా కథువా, సంబా, రాజౌరీ, పూంచ్ జిల్లాలలో మాత్రం ఇంకా జరుగుతున్నాయి. ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకుని కోత పనులు పూర్తి చేయాలని సైన్యం రైతులను కోరినట్టు ఒక అధికారి తెలిపారు. జమ్ము కశ్మీరులోని నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వెంబడి పాకిస్థానీ దళాలు వరుసగా ఎనిమిదో రోజూ కవ్వింపు కాల్పులకు తెగబడ్డాయి. వీటిని భారతీయ సైన్యం సమర్థంగా తిప్పికొట్టినట్టు గురువారం అధికారులు వెల్లడించారు. ఎల్‌ఓసీ, ఐబీ వెంబడి సమీపంలో నివసించే గ్రామస్థులు పాక్ కాల్పుల నుంచి స్వీయ రక్షణ నిమిత్తం తమ బంకర్లను శుభ్రం చేసుకునే పనికి ఉపక్రమించారు. కుప్వారా, బారాముల్లా, పూంచ్ నౌషేరా, అఖ్నూర్‌లో పాక్ బలగాలు కాల్పులు జరిపాయని జమ్ములో రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత్, పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్(డీజీఎంఓస్) మధ్య ఇటీవల హాట్‌లైన్ ద్వారా చర్చలు జరిగిన తర్వాత పాక్ నుంచి ఈ తరహా కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరగడంపై భారత్ హెచ్చరించింది.

**1,000కిపైగా మదర్సాలకు తాళం**

పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)లో వెయ్యికి పైగా మదర్సాలను 10 రోజులపాటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భారత్‌తో యుద్ధ భయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### 2 నెలలకు సరిపడా ఆహారాన్ని భద్రపర్చుకోండి

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ముందు జాగ్రత్తగా సరిపడా ఆహార నిల్వలు ఉంచుకోవాలని పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రభుత్వం శుక్రవారం తన పౌరులకు సూచించింది. పీవోకే ప్రధాని చౌదరి అన్వరల్ ఉల్ హక్ స్థానిక అసెంబ్లీలో మాట్లాడుతూ నియంత్రణ రేఖ వెంబడి ప్రాంతాలతో పాటు 13 నియోజకవర్గాల ప్రజలు రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ ఉంచుకోవాలని కోరారు. ఆహారం, మందులు, ఇతర నిత్యావసరాలను పౌరులకు అందించేందుకు పీవోకే రూ.100 కోట్లతో ఒక అత్యవసర నిధిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, భద్రతా కారణాలతో ఇప్పటికే పీవోకేలోని గిల్గిట్, స్కర్దుతో పాటు పలుప్రాంతాలకు పాకిస్థాన్ బుధవారం నుంచి విమాన సర్వీసులను నిలిపివేసింది.

# పాక్‌పై ఆర్థిక దిగ్బంధం!

- ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్లాన్
- పాక్‌ను ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో తిరిగి చేర్చడంపై చర్చలు
- రుణాలు ఇవ్వకుండా ఆర్థిక సంస్థలపై ఒత్తిడికి వ్యూహం



న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఆంక్షలు విధించడమే కాకుండా దాయాది దేశాన్ని ఆర్థికపరమైన చక్రవ్యూహంలో బంధించాలని భారత్ యోచిస్తోంది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలపై ఆర్థికపరమైన ఆంక్షలను విధించే లక్ష్యంతో ఏర్పడిన ఆర్థిక కార్యాచరణ టాస్క్ ఫోర్స్(ఎఫ్‌ఏటీఎఫ్) గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చాలని ఒత్తిడి తీసుకురావాలని భారత్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌పై రెండు రకాలుగా ఆర్థికపరమైన ప్రతీకార చర్యలు చేపట్టాలని భారత్ యోచిస్తోంది. అందులో మొదటిది పాకిస్థాన్‌ను మళ్లీ ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్పించేలా లాబీ చేయడం. దేశంలోని ఉగ్రవాద గ్రూపులకు సరిహద్దుల అవతల నుంచి అందుతున్న ఆర్థిక సహాయాన్ని అడ్డుకోవాలన్న విస్తృతమైన వ్యూహంలో భాగంగా ఈ చర్య చేపట్టాలన్నది భారత్ ఆలోచన. ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్‌ను చేర్చాలన్న డిమాండును ముందుకు తీసుకెళ్లాలంటే తీసుకోవలసిన చర్యల గురించి ప్రభుత్వంలో చర్చ జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పాకిస్థాన్ గతంలో 2018 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఉంది. గతంలో ఈ లిస్టులో ఉన్న రోజుల్లో దేశంలోకి అక్రమ నిధుల ప్రవాహం తగ్గిందని భారత్ వాదిస్తోంది. ఇక రెండో చర్య పాకిస్థాన్‌కు రుణాలు అందచేస్తున్న బహుళ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవడం. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు, ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)తోసహా ప్రధాన ఆర్థిక సంస్థలతో బహిరంగ చర్చలు ప్రారంభించాలని భారత్ భావిస్తున్నట్లు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు.

**రుణ పునఃసమీక్షకు వినతి**

పాకిస్థాన్‌కు అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని పునఃసమీక్షించాలని ఆయా ఆర్థిక సంస్థలను కోరాలని భారత్ భావిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైనప్పటికీ పాకిస్థాన్‌కు అభివృద్ధి సాయం కొనసాగడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేయనున్నట్లు ఆ అధికారి చెప్పారు.

**రుణం అందకుండా ఒత్తిడి**

ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు తిరిగి పట్టాలెక్కించడానికి ఐఎంఎఫ్ 700 కోట్ల డాలర్ల(భారతీయ కరెన్సీలో రూ.59,026 కోట్లు) రుణాన్ని అందచేస్తోంది. 2024 సెప్టెంబర్‌లో విడుదలైన ఈ రుణం విడతల వారీగా పాక్ అభివృద్ధి కోసం విడుదల చేస్తోంది. పాకిస్థాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి 1958 నుంచి ఇప్పటివరకు 24 సార్లు ఐఎంఎఫ్ రుణం అందచేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరాయంగా పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఈ తరహా ఆర్థిక సహాయం అందచేయడంలోని విశ్వసనీయతను, దూరదృష్టిని భారత్ ప్రశ్నించే అవకాశం ఉంది. ఇది గాక 4,340 కోట్ల డాలర్ల(రూ.1.13 లక్షల కోట్లు) రుణాన్ని 764 పబ్లిక్‌సెక్టార్ రుణాలు, గ్రాంట్ల కింద పాకిస్థాన్‌కు అందచేయడానికి ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ముందుకువచ్చింది. వీటితోపాటు 365 ప్రాజెక్టుల కోసం 4,970 కోట్ల డాలర్ల రుణాన్ని(రూ.4.19 లక్షల కోట్లు) అందచేస్తామని ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు వాగ్దానం చేసింది. ఈ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవాలని భారత్ యోచిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు.

### పాక్‌పై భారత్ దాడిచేస్తే ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమించుకోవాలి

**బంగ్లా ప్రభుత్వాధినేత యూనస్ సన్నిహితుడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: పహల్గాం ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం కనుక పాకిస్థాన్‌పై దాడిచేస్తే, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ ఆక్రమించుకోవాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ సన్నిహితుడు, మాజీ సైనికాధికారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ రైఫిల్స్ (ప్రస్తుతం బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్) మాజీ అధిపతి అయిన మేజర్ జనరల్ (రిటైర్డ్) ఏఎల్ఎం ఫజ్లూర్ రెహ్మాన్ ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా ఈ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సంయుక్త సైనిక వ్యవస్థ కోసం చైనాతో బంగ్లాదేశ్ మాట్లాడాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ఆయన ఫేస్‌బుక్‌లో బెంగాలీలో పోస్టు చేశారు.

### ఉగ్ర సంస్థలతో పాక్ సంబంధాలు రహస్యమేమీ కాదు

**పాక్ మాజీ మంత్రి బిలావల్**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు ఉగ్రవాద శక్తులతో సంబంధాలు ఉన్నాయని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో అంగీకరించారు. రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని స్కై న్యూస్ ఇంటర్వ్యూలో కోరినపుడు భుట్టో స్పందిస్తూ, 'రక్షణ మంత్రి చెప్పిన విషయంలో, పాకిస్థాన్‌కు గత చరిత్ర ఉన్నదనేది రహస్యమని నేను భావించడం లేదు. దాని ఫలితంగా మేం బాధపడ్డాం, పాకిస్థాన్ బాధపడింది. మేం నష్టపోయాం. ఒకదాని తర్వాత మరొకటి వచ్చిన తీవ్రవాద ప్రభంజనాలను ఎదుర్కొన్నాం. అయితే, జరిగిన నష్టం ఫలితంగా మేం గుణపాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్యను పరిష్కరించడానికి మేం అంతర్గత సంస్కరణలు అమలు చేశాం' అని చెప్పారు.

### పాక్ ప్రధాని యూట్యూబ్ చానల్ సస్పెండ్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ యూట్యూబ్ చానల్‌ను భారత్ శుక్రవారం సస్పెండ్ చేసింది. ఇటీవల పలువురు పాక్ నటుల సామాజిక మాధ్యమ ఖాతాలను కేంద్రం బ్లాక్ చేసింది. ఈ కోవలోనే ఇప్పుడు పాక్ ప్రధాని యూట్యూబ్ చానల్‌ను నిషేధించింది. భారత జాతీయ సమగ్రతను దెబ్బ తీసేలా, భారతీయులను తప్పు దోవ పట్టించేలా పాక్‌కు చెందిన మీడియా, సోషల్ మీడియా సంస్థలు, వ్యక్తులు కంటెంట్‌ను సృష్టించి వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం మండిపడుతున్నది.

### అధిక ఎండలు, చలికి 35 వేల మంది మృతి

**భారత్‌లో 2001-2019 పరిస్థితులపై ఓ అధ్యయనం వెల్లడి**

న్యూఢిల్లీ: భారత్‌లో 2001-2019 మధ్య కాలంలో అధిక ఎండలు, చలి కారణంగా కనీసం 35 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తాజా అధ్యయనం వెల్లడించింది. టెంపరేచర్ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ఒక్క 2015లోనే వడదెబ్బ కారణంగా 1,907 మంది, తీవ్రమైన చలి వల్ల 1,417 మంది ప్రాణాలు కోల్పోయారని అధ్యయనం తెలిపింది. అయితే తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల కలిగే మరణాలను, అనారోగ్య ప్రభావాలను నివారించొచ్చని.. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధ్యయన ప్రధాన రచయిత ప్రదీప్ గుయిన్ తెలిపారు. పనిచేసే వయసులో ఉన్నవారే వడదెబ్బ వల్ల ఎక్కువగా చనిపోతున్నారని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మహిళలతో పోలిస్తే పురుషుల్లో మరణాలు 3-5 రెట్లు, తీవ్రమైన చలి వల్ల సంభవించిన మరణాలు 4-7 రెట్లు పెరిగాయని పరిశోధకులు తెలిపారు.

## ఇంత దారుణంగా పన్నులా?

- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బ్రూవరీస్ సంఘం మండిపాటు
- రెండేండ్లలో 205 శాతానికి పెరిగిన అదనపు ఎక్సైజ్ డ్యూటీ



బెంగళూరు, మే 2: కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో గత రెండు సంవత్సరాల్లో మూడుసార్లు అదనపు ఎక్సైజ్ డ్యూటీ (ఏఈడీ)ని పెంచడం పట్ల బ్రూవరీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) శుక్రవారం మండిపడింది. తాజాగా బీర్‌పై 10 శాతం ఏఈడీని పెంచడాన్ని ఆక్షేపించింది. గత రెండేళ్లలో ఏఈడీ 205 శాతానికి పెరిగిందని ఆరోపించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం పెంచిన పన్నును ఉపసంహరించుకోవాలని, ఇలా తరచూ పన్నులు పెంచే విధానాన్ని మానుకోవాలని కోరింది. కాంగ్రెస్ ప్రభుత్వ చర్య కారణంగా మద్యం పరిశ్రమకు తీవ్ర నష్టం కలగడమే కాక, రాష్ట్ర పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది.

**రెండేళ్లలో నాలుగు సార్లు**

రెండేళ్ల కన్నా తక్కువ వ్యవధిలో ప్రభుత్వం నాలుగుసార్లు (మూడుసార్లు ఏఈడీ, ఒకసారి ఎక్సైజ్ డ్యూటీ) పన్ను పెంచిందని, ఇది తాము ఎక్కడా చూడలేదని బీఏఐ డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి అన్నారు. దీని కారణంగా బీర్ ధర రూ.160 నుంచి రూ.200కు చేరుకుందని విమర్శించారు. 2023-24లో బీర్ పరిశ్రమ వృద్ధి 46 శాతం ఉండగా, 2024-25కు దారుణంగా కేవలం ఒక శాతానికి పడిపోయిందని అన్నారు. తాజా అదనపు పన్ను బాదుడు కారణంగా ఇది మరింత దిగజారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పన్ను ఆదాయానికి బీరు అసమానంగా అధికంగా దోహదపడుతున్నదన్నారు. మద్యం పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి 16 శాతం పన్ను ఆదాయం లభిస్తున్నదని, ఐదేండ్ల క్రితం ఇది 11 శాతం మాత్రమే ఉండేదన్నారు. ఎక్కడా లేని విధంగా బీఏఐ సభ్యులు కర్ణాటకలో ఈ పరిశ్రమపై 3,500 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి 11 బ్రూవరీల ద్వారా 7 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే రోజురోజుకు అమ్మకాలు దిగజారుతున్నాయని, ఇది వాణిజ్యపరంగా వ్యాపారులకు ఎంతమాత్రం అనుకూలం కాదని ఆయన తెలిపారు.

### విమానమెక్కాలంటే రియల్ ఐడీ చూపించాల్సిందే

**గ్రీన్‌కార్డుదారులకు అమెరికా ఆదేశాలు**

వాషింగ్టన్, మే 2: అమెరికాలో నివసిస్తున్నారా? గ్రీన్ కార్డు ఉందా? అయినప్పటికీ ఈ నెల 7 నుంచి మీరు దేశీయంగా విమానాల్లో ప్రయాణించాలంటే మీ రియల్ ఐడీని చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రం జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ లేదా రియల్ ఐడీకి అనుకూలంగా లేని ఐడీలను ఇకపై విమానాశ్రయాలలో చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రంగా అంగీకరించరు. అంటే 7వ తేదీ నుంచి ప్రయాణించేటప్పుడు పాస్‌పోర్ట్ వంటి ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ ఐడీ ఫారమ్‌తో ప్రయాణించాలి. లేదా వారి రాష్ట్ర మోటారు వాహనాల విభాగం (డీఎంవీ) కార్యాలయాల ద్వారా జారీ చేసిన రియల్ ఐడీ కోసం నమోదు చేసుకోవాలి. ఒకవేళ ప్రయాణికులు ప్రభుత్వ ఐడీ, లేదా ప్రత్యామ్నాయ ఐడీని కనుక చూపించడంలో విఫలమైతే వారు అదనపు స్క్రీనింగ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. లేదా వారికి ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ చెక్ పాయింట్ల వద్దకు ప్రవేశాన్ని తిరస్కరించవచ్చునని అమెరికా హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ (డీహెచ్ఎస్) ప్రకటించింది.

## ముస్లింల లోనూ కుల గణన

**దేశంలో తొలిసారి సేకరణకు ప్లాన్ ▪ పస్మందా వర్గం ఓట్ల కోసమేనా?**



న్యూఢిల్లీ: ఈసారి దేశ జన గణనతోపాటే కుల గణన చేపట్టాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం ముస్లింల జనాభా వివరాలను కులాల వారీగా సేకరించనుంది. భారత్‌లో ముస్లింలలో కుల గణన చేపట్టనుండటం ఇది తొలిసారి. దీని ద్వారా ఆ మతస్థుల సామాజిక-ఆర్థిక, విద్య స్థాయి, స్థితిగతులను తెలుసుకోవాలని బీజేపీ సర్కారు భావిస్తున్నది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం.. పస్మందా ముస్లింలను ఓబీసీ విభాగంలో లెక్కించనున్నారు. 1973లో జేఎన్‌యూ ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ చేసిన అధ్యయనం ప్రకారం ముస్లింలలో కుల అంతరాలు ఉన్నాయి. అయితే ముస్లింలలో వెనకబడిన వర్గంగా చెప్పున్న పస్మందా ముస్లింలను ఆకట్టుకొని వారిని ఓట్ బ్యాంకుగా మార్చుకోవాలని బీజేపీ కొన్నేండ్లుగా ప్రయత్నిస్తున్నది. దేశంలోని ముస్లింలలో 70 శాతానికిపైగా పస్మందా ముస్లింలే ఉంటారని అంచనా వేస్తున్నది.

## డాక్టర్లు జనరిక్ మందులనే సూచించాలి

**అప్పుడే ఫార్మా కంపెనీల లంచాల సమస్యకు పరిష్కారం: సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: వైద్యులు జనరిక్ మందులను మాత్రమే సూచించడాన్ని చట్టబద్ధంగా తప్పనిసరి చేసినపుడు, వారికి ఫార్మా కంపెనీలు లంచాలు ఇస్తున్నారనే సమస్య పరిష్కారమవుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ వాదన ప్రకారం అధిక, అహేతుక మందులను, మితిమీరిన ధరలు గల బ్రాండ్లను సూచించేందుకు వైద్యులకు ఔషధ తయారీ కంపెనీలు లంచాలు ఇస్తున్నాయి. యూనిఫాం ఫార్మాస్యుటికల్ మార్కెటింగ్ కోడ్‌కు చట్టబద్ధత కల్పించే వరకు, ఔషధ తయారీ కంపెనీలు అనైతిక మార్కెటింగ్ విధానాలకు పాల్పడకుండా కట్టడి చేసేందుకు మార్గదర్శకాలు ఇవ్వాలని కోర్టును కోరారు. తగిన సవరణలతో ఈ కోడ్‌ను అందరికీ వర్తించే విధంగా ఆదేశించాలని కోరారు.

### చిలీ, అర్జెంటీనాలో భారీ భూకంపం

**7.4 తీవ్రత.. సునామీ హెచ్చరిక జారీ**

శాంటియాగో(చిలీ), మే 2: చిలీ, అర్జెంటీనాలోని దక్షిణ కోస్తా ప్రాంతాలలో శుక్రవారం 7.4 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం అందలేదు. చిలీకి దక్షిణాన మెగెలియన్ జలసంధికి చెందిన కోస్తా ప్రాంతంలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ప్రభుత్వ అధికారులు ఆదేశించారు. సునామీ హెచ్చరికలు రావడంతో కోస్తా ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. చిలీకి చెందిన అంటార్కిటిక్ భూభాగంలోని బీచ్ ప్రదేశాలను వదిలిపెట్టి వెళ్లిపోవాలని కూడా పర్యాటకులు, స్థానిక ప్రజలను చిలీ ప్రభుత్వం ఆదేశించింది.

## రోడ్డెక్కిన చైనా కార్మికులు

- ట్రంప్ సుంకాలతో చైనా కుదేలు
- తయారీ, నిర్మాణ రంగాల్లో తలెత్తిన సంక్షోభం
- తీవ్రంగా క్షీణించిన ఎగుమతులు
- ఫ్యాక్టరీల షట్‌డౌన్.. వేతనాల ఎగవేతలపై కార్మికుల ఆగ్రహం



బీజింగ్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలతో చైనా కుదేలవుతున్నది. ఆ దేశ తయారీ, నిర్మాణ రంగం కుదుపునకు గురైంది. ఎగుమతులు భారీగా పడిపోవడంతో పరిశ్రమలు షట్‌డౌన్‌లు, లేఆఫ్‌లు ప్రకటించాల్సిన పరిస్థితి తలెత్తింది. పరిశ్రమలు కొవిడ్ తర్వాత మరోసారి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుండటంతో కార్మికులకు వేతనాలు కూడా చెల్లించడం లేదు. దీంతో కార్మికులు రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనలు.. ఏప్రిల్ చివరి నాటికి తీవ్రమయ్యాయి. షాంఘై నుంచి ఇన్నర్ మంగోలియా వరకు దాదాపు అన్ని ఇండస్ట్రీ జోన్లలో కార్మికుల నిరసనలు కొనసాగుతున్నాయి. టోంగ్లియావో నగరంలో నిర్మాణరంగ కార్మికులు తమకు వేతనాలు చెల్లించకపోవడంపై భవనాలు ఎక్కి నిరసన వ్యక్తంచేశారు. ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. జనవరి నుంచి వేతన బకాయిలు పేరుకుపోవడంపై షాంఘైలోని ఓ ఎల్‌ఈడీ లైట్ల ఫ్యాక్టరీలోని వేల మంది కార్మికులు రోడ్డెక్కారు. దావో కౌంటీలో ఓ స్పోర్ట్స్ కంపెనీని ఎలాంటి సమాచారం లేకుండానే మూసేశారు. ఈ నేపథ్యంలో టారిఫ్‌లపై అమెరికా చర్చలకు ముందుకు వస్తుందని చైనా వాణిజ్య శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది.



### హార్వర్డ్ వర్సిటీకి పన్ను మినహాయింపు రద్దు: ట్రంప్

వాషింగ్టన్: హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి పన్ను మినహాయింపు హోదాను రద్దు చేయబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. క్యాంపస్ ఉద్యమాలపై ఆంక్షలు విధించడంతోపాటు మరికొన్ని సంస్కరణలను అమలు చేయాలని ట్రంప్ చేసిన డిమాండ్‌కు హార్వర్డ్ అంగీకరించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ట్రూత్ సోషల్‌లో ఇచ్చిన పోస్ట్‌లో, ''ఇదే తగిన శాస్తి'' అని ట్రంప్ పేర్కొన్నారు. అడ్మిషన్ విధానాలు, ఆడిట్, కొన్ని స్టూడెంట్ క్లబ్‌ల గుర్తింపు రద్దు వంటి సంస్కరణలు చేపట్టాలని ట్రంప్ కోరగా.. ప్రభుత్వానికి లొంగేది లేదని వర్సిటీ స్పష్టం చేసింది. కొద్ది గంటల్లోనే ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ వర్సిటీకి 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లను స్తంభింపజేసింది.




## ఐక్యతే మన ఆయుధం

**అమరావతి సభలో ప్రధాని మోదీ**

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): కేవలం ఆయుధాలు మాత్రమే భారత్ శక్తి కాదని.. ఐక్యతే మన ఆయుధమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. శుక్రవారం ఏపీ రాజధాని అమరావతిలో పునః నిర్మాణ సభలో మోదీ మాట్లాడారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన ఏపీలో పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్యస్థానంగా మారుతుందని తెలిపారు. అమరావతిలో మౌలిక వసతుల కల్పనలో కేంద్రం సహకరిస్తుందని చెప్పారు.

**కట్టుబట్టలతో గెంటేశారు.. మంత్రి లోకేశ్**

సభలో ప్రసంగించిన ఏపీ మంత్రి లోకేశ్ తెలంగాణ ఏర్పాటుపై తన అక్కసు వెల్లగక్కారు. '2014లో రాష్ట్ర విభజన జరిగిన సమయంలో కట్టుబట్టలతో మెడబట్టి మనల్ని గెంటేశారు' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'రాజధాని లేకుండానే రాష్ట్రాన్ని విడగొట్టారు. చంద్రబాబుకు సంక్షోభాలు కొత్త కాదు.. అందరి ఆమోదం తెలిపిన తర్వాతనే అమరావతిని రాజధానిగా ప్రకటించారు' అని పేర్కొన్నారు.

### వారికి నిద్రలేని రాత్రులే!

- తనతోపాటు శశిథరూర్ ఉండటంపై కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- కేరళలో విఝింజమ్ ఓడరేవు ప్రారంభం

న్యూఢిల్లీ, మే 2: కేరళ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్ ఎంపీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురం సమీపంలో నిర్మించిన విఝింజమ్ అంతర్జాతీయ ఓడరేవును శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. మోదీ మాట్లాడుతూ 'ఈ సభలో శశి థరూర్ కూర్చున్నారు. ఈ వేదికపై ఆయన ఉండటం కొందరికి నచ్చదు. కొందరికి ఇది నిద్రలేని రాత్రుళ్లను మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి చేరుకుంటుంది.' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, కేరళకు చేరుకున్న ప్రధానిని ఎంపీ స్వయంగా కలిసి స్వాగతం పలికారు. ఇటీవలి కాలంలో కాంగ్రెస్‌లో నాయకత్వ శూన్యత ఏర్పడిందని శశి థరూర్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.



### ఢిల్లీని ముంచెత్తిన వాన

**200 విమాన సర్వీసులకు అంతరాయం**

న్యూఢిల్లీ, మే 2: దేశ రాజధాని ఢిల్లీని వర్షం ముంచెత్తింది. భారీ వర్షానికి ఒక మహిళ, ముగ్గురు పిల్లలు మృతి చెందారు. అలాగే విద్యుదాఘాతానికి 25 ఏండ్ల యువకుడు మృతి చెందాడు. 200కు పైగా విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. 1901 తర్వాత మే నెలలో ఢిల్లీలో 24 గంటల వ్యవధిలో కురిసిన రెండో అతి పెద్ద వాన ఇదేనని అధికారులు తెలిపారు.